## క్లుప్తంగా

### ఆధార్ అప్‌డేట్ చేయించండి



గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మోతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఓటువాని గిరిజన కాలనీలో గిరిజనులకు సంబంధించిన ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించాలని గ్రామ కార్యదర్శి మునెమ్మను ఎంపీడీఓ మోతి ఆదేశించారు. గురువారం ఆమె గిరిజన కాలనీలో పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ఆధార్‌ను అప్‌డేట్ చేయించాలని, గిరిజనులకు ఉపాధి హామీ పథకంలో పనులను చూపించాలని తెలిపారు. ఆధార్ అప్‌డేట్ చేయకపోతే ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు అందవని, తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేయించాలన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన



గ్యారేజీ ముందు నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాళహస్తి: ఆర్టీసీలోని అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎస్ఎంయూఏ శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో అధ్యక్షుడు జొన్నలగడ్డ మురళి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో ఎర్రబ్యాడ్జీలతో ఆందోళన చేశారు. శుక్రవారం కూడా ఆందోళన చేయనున్నట్లు చెప్పారు. నేతలు ఎంఎస్ మణ్యం, జీకే రెడ్డి, ఆనంద్, జగన్నాథం, నాగరాజు, మునీర్ కేఎస్ఆర్ కృష్ణ, గ్యారేజీ రెడ్డి పాల్గొన్నారు.

### పెరటి కోళ్ల పంపిణీ



పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న పీడీ

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట, ఏర్పేడులో గురువారం డ్వాక్రా మహిళలకు 100 యూనిట్ల పెరటి కోళ్లను డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పంపిణీ చేశారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆయన కోరా రు. అడిషనల్ పీడీ ప్రభావతి, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, సీసీలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

### పల్లికొండేశ్వరునికి రూ.6.61లక్షల ఆదాయం



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ లత

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ఉన్న సర్వమంగళ సమేత పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో గురువారం తిరుపతి డివిజన్ దేవాదాయ శాఖ తనిఖీదారులు పనిరాజశయన్ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వాహణాధికారి లత ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ లత మాట్లాడుతూ 59 రోజులకుగాను దేవస్థానం హుండీల ద్వారా రూ.6,11,243, అన్నదాన హుండీ ద్వారా రూ.50,559, మొత్తం రూ.6,61,802 ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హనీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఎస్ఆర్ పట్టెడలో ఈడీ అధికారులు



గ్రామంలో ఈడీ అధికారులు, పోలీసులు

రేణిగుంట: మండలంలోని తూకివాకం పంచాయతీ, ఎస్ఆర్ పట్టెడలోని అక్కిరెడ్డి ఇంట్లో గురువారం మధ్యాహ్నం తమిళనాడు ఈడీ అధికారులు సోదాలు నిర్వహించేందుకు వచ్చారు. విషయం తెలియడంతో గ్రామస్తులకు, ఈడీ అధికారుల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. తమిళనాడు పోలీసులు ఎస్పీ కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో రేణిగుంట రూరల్ సీఐ మంజునాథరెడ్డి, స్పెషల్ పార్టీ పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. ఈడీ అధికారులకు వచ్చిన అడ్రస్ తప్పని తెలియడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లారు.

### రక్తహీనత నివారణపై అవగాహన

శ్రీకాళహస్తి: ఎంపేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఇనగలూరులో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా రక్తహీనత నివారణపై వైద్యాధికారి సుధీర్‌కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెలికం పాపిరెడ్డి, శివారెడ్డి, సుబ్బయ్య, రామయ్య, నాగరాజు, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# ప్రయాణిస్తే ఒళ్లు హూనమే!



గుంతలమయంగా తడ-వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు



తడ మార్గంలోని ఇనమాలగుంట వద్ద గుంతలమయంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

- గోతులమయమైన తడ-వరదయ్యపాళెం రోడ్డు
- అవస్థలు పడుతున్న వాహనదారులు

వరదయ్యపాళెం: నిత్యం వందలాది వాహనాలు వెళ్లే తడ-వరదయ్యపాళెం ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గం గుంతలమయంగా మారింది. ఆ మార్గంలో వెళ్లాలంటే వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు గుంతలను గమనించక నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు కనికరించడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

**అధికారులూ కాస్త పట్టించుకోండి**

తడ-వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గం గుంతలతో ధ్వంసమైంది. గత ప్రభుత్వంలో కడూరు కూడలి నుంచి శ్రీకాళహస్తి వరకు ప్రధాన రోడ్డు మార్గాన్ని అభివృద్ధి చేశారు. దీంతో ఓ లేయర్ పూర్తిగా బీటీ వేశారు. అయితే అదేమార్గంలోని కడూరు కూడలి నుంచి తడ వరకు రోడ్డు అభివృద్ధి జరగలేదు. దీంతో ఈ మార్గంలో ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడుతూ రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. అధికారులు స్పందించి కడూరు కూడలి నుంచి తడ వరకు 10 కి.మీల దూరం పూర్తిగా అభివృద్ధి చేసేందుకు తోడ్పాటునివ్వాలని స్థానికులు కోరుతున్నారు.

**అవస్థలు పడుతున్నాం**



కడూరు కూడలి నుంచి తడ వరకు రోడ్డు ఎక్కడపడితే అక్కడ గుంతలమయంగా మారింది. ప్రధానంగా ద్విచక్రవాహనదారులు గుంతల్లోకి దిగి ప్రమాదాలకు గురవుతున్నారు. అయితే అధికారుల్లో ఏమాత్రం చలనం లేదు. ప్రధానంగా కడూరు కూడలి నుంచి బత్తలవల్లం వరకు ఉన్న అటవీ మార్గం ప్రాంతంలో గుంతలు అధికంగా ఉన్నాయి. కనీసం గుంతలు పూడ్చే విధంగా అతుకులు అయినా వేయాలి. – వినోద్, ద్విచక్రవాహనదారుడు

**రోడ్డు అభివృద్ధి చేయాలి**



రోడ్డు అభివృద్ధికి అధికారులు స్పందించాలి. గత కొద్దిరోజులుగా ఈ మార్గం గుంతలమయంగా మారింది. తక్షణమే రోడ్డు అభివృద్ధి గురించి అధికారులు స్పందించాలి. నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. తక్షణమే ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. ఉజ్వల్‌రెడ్డి, బత్తలవల్లం

# క్రీడలతో మానసికోల్లాసం



పరుగు పందెంలో విద్యార్థినులు

బుచ్చినాయుడుకండ్రిగ: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం వస్తుందని హెచ్ఎం గాయత్రి తెలిపారు. గురువారం మండలంలోని పల్లమాలకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ క్రీడల నిర్వహణలో భాగంగా మండల స్థాయి షాట్‌పుట్, లాంగ్‌జంప్, డిస్కస్‌త్రో, రన్నింగ్ క్రీడా పోటీలను వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈ పోటీల్లో నెలవాయి, కల్లివెట్టు, చల్లమాంబపురం, బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వినోద్, మస్తాన్, హరిబాబు, మురళీమోహన్, దాసు, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.



షాట్‌పుట్ వేస్తున్న విద్యార్థి

### కూలీలకు సౌకర్యాలు కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కూలీలకు నీరు, నీడ, సౌకర్యాలతోపాటు, ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని ఎంపీడీఓ మోతి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆమె ఓటువాని గిరిజన కాలనీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఏపీఓ దేవరి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎయిడ్స్‌పై అవగాహన

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు స్టెప్స్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై ఐఈసీ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందులు లేవని నివారణ ఒక్కటే మార్గమన్నారు. అందుకు తగ్గ వైద్యసలహాలు తెలిపారు. డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను వివరించారు. స్టెప్స్ ప్రాజెక్టు మేనేజర్ భాస్కర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### అందుబాటులో కొత్త వరి వంగడాలు

బుచ్చినాయుడుకండ్రిగ: వ్యవసాయ పరిశోధనా సంస్థ నెల్లూరులో వివిధ నూతన వరి వంగడాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి షణ్ముగం తెలిపారు. ఎన్ఎల్ఆర్ 34449 ఎఫ్ఎస్, ఎన్ఎల్ఆర్ 34449 టీఎల్, బీపీటీ 2504 ఎఫ్ఎస్, ఎన్ఎల్ఆర్ 40024 ఎఫ్ఎస్, ఎన్ఎల్ఆర్ 30491 టీఎల్ కొత్త రకాల వరి వంగడాలున్నాయని, అవసరమైన రైతులు తెచ్చుకోవచ్చని తెలిపారు.

### నేడు ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ఉన్న సర్వ మంగళ సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ ఈఓ లత తెలిపారు. ఆమె మాట్లాడుతూ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకేశ్వరస్వామి, మరగదాంబిక అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రదోష పూజలో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి రసీదు పొంది పాల్గొనాలని తెలిపారు.

# పలు కుటుంబాలకు నూకతోటి పరామర్శ



మునస్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మండలంలోని పార్టీ శ్రేణుల పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పరామర్శించారు. వరదయ్యపాళెం మండలం తొండంబట్టులోని పెద్ద కర్రెయ్య సతీమణి గోవిందమ్మ, నాగనందాపురంలోని పార్టీ నాయకుడు మూగాల రాజ, వెంగారెడ్డికండ్రిగ దళితవాడలో మునస్వామి మృతిచెందగా సమాచారం అందుకున్న ఆయన ఆయా గ్రామాలకు వెళ్లి వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

# ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

నాగలాపురం: మండలంలోని వినోభానగర్‌లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ తరపున వైద్యాధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ అరుణ్ కిషోర్ మహిళలకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరానికి హాజరైన మహిళలకు షుగర్, రక్తపోటు, రక్తహీనత, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం గురించి మహిళలకు వివరించారు. చివరిగా పిల్లలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోండి

సత్యవేడు : గ్రామ, పట్టణాల్లోని మహిళల ఆరోగ్యం కోసం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభయాన్ పేరుతో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ హర్షవర్ధన్ కోరారు. గురువారం కన్నావరంలో పీహెచ్‌సీ డాక్టర్ల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అక్టోబర్ 2 తేదీ వరకు నిర్వహించనున్న వైద్యశిబిరాల్లో రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, క్షయ వ్యాధులను స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారన్నారు. నిర్ణీత తేదీల్లో స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తారని తెలిపారు.

# శ్రీకాళహస్తి ట్రస్టుబోర్డు చైర్మన్‌గా కొట్టే సాయి

- ఎమ్మెల్యే బలపరిచిన చెంచయ్యనాయుడికి మొండిచెయ్యి



కొట్టే సాయి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ పదవిని ఎమ్మెల్యే తరువాత ఎమ్మెల్యే పదవిగా చెప్పుకుంటారు. ఒకటిన్నర సంవత్సరం ఊరించి ఎట్టకేలకు అనూహ్యంగా జనసేన జిల్లా కార్యదర్శి కొట్టే సాయి పేరు తెరపైకి వచ్చింది. గురువారం ప్రభుత్వం ప్రకటించిన జాబితాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్‌గా శ్రీకాళహస్తి కాపు సామాజికవర్గానికి చెందిన కొట్టే సాయికి అవకాశం వచ్చినట్లు ప్రకటించారు. శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జ్ కోట వినుత డ్రైవర్ రాయుడు హత్య కేసులో జనసేన నుంచి సస్పెండ్ అయ్యారు. అయితే శ్రీకాళహస్తి జనసేన ప్రాబల్యాన్ని పెంచేందుకు పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ చొరవతో కట్టే సాయికి చైర్మన్‌గా అవకాశం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అలాగే వైఎస్సార్‌సీపీ పంథాను అనుసరిస్తూ కాపు వర్గానికి బోర్డుమెంబర్‌గా ప్రతిపాదనలో ఉన్న కొట్టే సాయికి అనూహ్యంగా చైర్మన్ పదవి దక్కింది. రాజకీయాల్లోకి వచ్చిన తక్కువ కాలంలోనే శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే ఉన్నత పదవిగా భావించే జిల్లాలో ముఖ్యమైన పదవి అయిన శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ పదవి దక్కడం సర్వత్రా చర్చ జరుగుతోంది.

**ఎమ్మెల్యే మాట నెగ్గలేదు..**

టీడీపీ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడిని ఆలయ పాలకమండలి చైర్మన్‌గా ఒకే పేరును ప్రతిపాదిస్తున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అనేకసార్లు ప్రకటించారు. అయితే అందుకు భిన్నంగా కొట్టే సాయికి అవకాశం రావడంతో ఎమ్మెల్యే మాట నెగ్గలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. చెంచయ్యనాయుడు సంవత్సరకాలంగా అప్రకటిత చైర్మన్‌గా ఆలయంలో గౌరవం అందుకుంటున్నాడు. ఈ అనూహ్య పరిణామంతో చెంచయ్యనాయుడు పదవి కోల్పోయాడు. గత మూడు నెలలుగా బీజేపీ, టీడీపీలోని సీనియర్ నాయకులు తమకే చైర్మన్ పదవి వస్తుందని ప్రకటనలు చేసుకుంటూ ఉన్నారు. వారికి ఎవరికి అవకాశం రాకుండా రాజకీయాల్లోకి వచ్చిన తక్కువ కాలంలో సీనియర్లను పక్కన పెట్టి ఇటీవల రాజకీయాల్లోకి వచ్చిన నాయకునికి పదవి రావడంపై టీడీపీ నేతలు విస్తుపోతున్నారు.

### శ్రీసిటీ డీఎస్పీగా శ్రీనివాసులు



వరదయ్యపాళెం: శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బీవీ శ్రీనివాసులు నియమితులయ్యారు. ఆ మేరకు గురువారం రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. శ్రీసిటీ సీఐగా ఉన్న ఆయన ఇటీవల జరిగిన ఉద్యోగోన్నతుల్లో డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. ఆ మేరకు ఆయన శ్రీసిటీ డీఎస్పీగా నియామకం అయ్యారు. ఆయన శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీసిటీ డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

### ముక్కంటి ఆలయంలో నవరాత్రి మహోత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఆమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా దేవీ నవరాత్రుల్లో జ్ఞానప్రసూనాంబ అమ్మవారు రోజుకో అలంకారంలో దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఈఓ కోరారు.

# వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి భరత్‌కుమార్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: బీసీ బాలుర హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు రాబోవు పబ్లిక్ పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం బుచ్చినాయుడుకండ్రిగలోని బీసీ బాలుర హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, రికార్డులను పరిశీలించి, పదో తరగతి విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి, సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం రుచి, శుచికరమైన భోజనం పెట్టాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ట్యూటర్లతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ బీసీ సంచాలకులు మునీంద్రయ్య, వసతి గృహ సంచాలకులు రామయ్య, పాల్గొన్నారు.

# క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన



క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



బస్సులో వచ్చిన వైద్య బృందం

రేణిగుంట: క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు విశేష స్పందన లభించింది. మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు గాజులమండ్యంలోని శ్రీ సాయి గణేష్ విద్యాలయంలో గురువారం ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలోని వైద్యులు ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. స్థానికులు అధిక సంఖ్యలో విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ టీవీడీ.ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత్, సీహెచ్ఓ అన్నపూర్ణ, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చైతన్యభాను, పంచాయతీ కార్యదర్శి గిరిధర్, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ జువ్వల ధనుంజయరెడ్డి, ఏఎన్ఎం సుభాషిణి, ఎంపీహెచ్ఈఓ నాగరాజు, ఎంపిహెచ్ఎస్‌లు అనురాధ, కామరాజు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### గ్రామ గ్రామాన వైద్య సేవలు



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

రేణిగుంట: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం గాజులమండ్యం, మామండూరు పంచాయతీలలో వైద్య ఆరోగ్యశిబిరాన్ని నిర్వహించారు. మండల వైద్యాధికారి చక్రపాణిరెడ్డి గాజులమండ్యం విలేజ్ క్లినిక్‌లో స్థానికులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించి వైద్యం అందించారు. మామండూరులో డాక్టర్ జుబేర్ స్థానికులకు వైద్య సేవలను అందించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శనలు నిర్వహించారు. సీడీపీఓ కృష్ణవేణి, సర్పంచ్ గంగారి రమేష్, సూపర్‌వైజర్లు హేమావతి, అనంతలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు కామరాజు, నాగరాజు, సుమశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా మహాకుంభాభిషేకం



కుంభాభిషేక వేడుకల్లో నేతలు

తొట్టంబేడు: మండలంలోని చియ్యవరంలో వెలసిన అంకమ్మతల్లి ఆలయంలో గురువారం మహాకుంభాభిషేక వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తండ్రి బియ్యపు గోవిందారెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు హాజరయ్యారు. ఆలయాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ నేతలు రూ. 25వేలు అందజేశారు. మండలాధ్యక్షుడు కొలిగి సుబ్రహ్మణ్యం, నేతలు ఇల్లీబాబు, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వేమాలయ్య, అలంకారయ్య, రఘురామయ్య, వెంటకేష్, బాలాజీ, పెంచులయ్య, కోటిశంకరయ్య, నరసింహులు, వెంకటముని, దేవేంద్ర పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవాలపై సమావేశం



హాజరైన పూర్వవిద్యార్థులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని రాజా పానుగంటి బంగారమ్మ సీతారామనాయని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై గురువారం అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. హెచ్ఎం తీగల వెంకటయ్య అధ్యక్షతన పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ 1921లో స్థాపించిన పాఠశాల శతాబ్ది ఉత్సవాన్ని కరోనా కారణంగా 2021లో నిర్వహించలేకపోయినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్వహించేందుకు అభిప్రాయ సేకరణ తీసుకుంటున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు గోపాలకృష్ణ, చిట్టిబాబు, పురుషోత్తంరెడ్డి, కుమార్ మోహన్, నిరంజన్, త్రిమూర్తి, కేశవ, లింకన్, రంగయ్య, శంకర్ పాల్గొన్నారు

### కైలాసనాథకోన పరవళ్లు



మండలంలోని ప్రఖ్యాత పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన కైలాసనాథకోన జలపాతం వర్షాలకు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. జలపాతం ఉధృతికి భక్తులను స్నానాలకు అనుమతించడం లేదు. వారం రోజులుగా అర్ధరాత్రి వర్షాలకు కైలాసనాథకోన జలపాతంలో నీటి ప్రవాహం పెరిగింది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి జలపాతం ఉధృతి పెరగడంతో కొండ పైభాగం నుంచి రాళ్లు పడే అవకాశం ఉన్నందున జలపాతంలో స్నానాలను నిషేధించినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

- నారాయణవనం